అమ్మమ్మ గారి వంట

"ఏమండోయ్" ఒక గావు కేక పెట్టింది కనక మహాలక్ష్మి. వీధి వరండాలో సావకాశంగా పేపర్ తిరిగేస్తున్న ఆ ఏమండి తుళ్ళిపడి ఊడిపడుతున్న లుంగి కట్టుకుంటూ లేచి లోపలికి పరిగెత్తాడు. కొంపదీసి ఇల్లాలేమన్నా జారిపడిందా, నడ్డో, కాలో విరిగిందా, అసలే భారికాయం అని భయపడి లోపలికెళ్ళే సరికి ఫోను చేతిలో పట్టుకుని, మొహం అంతా పౌడర్ అంత మందాన పులుముకున్నంత నవ్వుతో నిలుచున్న భార్యని చూసేసరికి తిక్కరేగింది ఆ ఏమండి గారికి.

"నీ దుంపతెగ ఎందుకే అలా అరిచావ్. నీ కేకలకి ఎప్పుడో గుండె ఆగి చస్తాను. పడ్డావేమో నని పరిగెత్తి వచ్చాను. ఏమైందే" కోపంగా అరిచాడు ఏమండీ అనే ఆంజనేయులు. "అబ్బా అది కాదండీ – 'మీ టి.వి. వస్తుంది' ఆనందంతో మాటలు తడబడ్డాయి. 'నీబొంద మీ టి.వి. వచ్చి ఏడుస్తుంది కదా, ఇందులో కొత్తేముంది.'

'అబ్బ అది కాదండీ, ఎల్లుండి మీ టి.వి. వారు అమ్మమ్మగారి వంట కోసం మన ఇంటికి వస్తున్నారు తెలుసా...'

'మనింటికా! ఎందుకు?'

'అబ్బ మొద్దు బుర్ర, ఎందుకేమిటి? నా వంట ప్రోగ్రాం షూట్ చేయడానికి వస్తున్నారు' తబ్బిబ్బవుతూ అంది ఆవిడ.

'నీవంట, నీ ప్రోగ్రామా – హతోస్మి నీవే దొరికావా వాళ్ళకి' ఇల్లాలిచేత వంట గత ముప్పై ఐదేళ్ళుగా తింటున్న ఆయన కంటే ఆ రుచులు ఎవరికి తెలుస్తాయి.

కనకమ్మ మొగుడి వంక చురచుర చూస్తూ "అంతేలెండి, పెరటి చెట్టు వైద్యానికి

పనికి రాదు. పెళ్ళాం వంట రుచి మొగుడికి తెలియదు. మీకో దండం అదంతే రోజు ఉండే గోలేగా మన మధ్య... పదండీ ముందు బ్యాంక్‌కి వెళ్ళాలి మనం. బట్టలు మార్చుకోండి" ఆర్డర్ వేసింది.

"బ్యాంక్‌కి ఎందుకు? నీ వంటకి ఎన్ని వేలు కావాలేమిటి డబ్బు –" వెటకారంగా అన్నాడాయన. కనకమ్మ నుదుట కొట్టుకుని "ఇదే అయోమయం మొగుడమ్మ. రోజూ టి.విలో నాతో పాటు వంటల ప్రోగ్రాం చూస్తున్నారుగా కళ్ళింత చేసుకుని...", చూడక చస్తానా, రిమోట్ నా చేతికి వస్తే కదా", అమాయకంగా అన్నారాయన.

"చూడండి వంటల ప్రోగ్రాంలో అందరూ చక్కగా వెండి కటోరీలు, పళ్ళాలు, బౌల్స్ అన్నీ ఎంత నిగనిగ లాడుతూ చక్కగా అలంకరిస్తారు కదా. కటోరీలలో పంచదార, పిండికూరలు అన్నీ నింపి పెడతారు కదా..."

"ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయల ముక్కలకు వెండి సామానెందుకే, స్టీలు బొచ్చెలు ఇంటినిండా ఉన్నాయి కదా. ఇప్పుడు బ్యాంక్ నుంచి అవన్నీ తెచ్చి ఇంట్లో పెట్టుకుంటే... రోజులసలే బాగాలేవు."

"చాల్లే ఊరుకోండి. వెండి సామానే కాదు నగలు తెచ్చుకోవాలి."

"ఇదేం పెళ్ళా, వడుగా నగలు దిగేసుకోడానికి", మళ్ళీ ఓ అడ్డుపుల్ల వేసాడు.

"నా ఖర్మ, అందరూ ఆడవాళ్ళు చక్కగా పట్టుచీరలు కట్టుకుని ఒంటినిండా నగలు పెట్టుకుని మహాలక్ష్మిలా కలకల్లాడిపోతుంటారు. చూడట్లేదా? పెళ్ళాం చక్కగా కనపడాలన్న ఆరాటం ఏకోసాన లేదు మీతో వాదించే టైం లేదు. మీరు రానంటే ఆటోలో పోతా. అంత బంగారం, వెండి పట్టుకుని ఆటోలో వస్తే ఏదైనా అయితే నన్నువద్దు" కోపంగా అంది.

పతిదేవుడు గతిలేక సతి వెన్నంటాడు.

బ్యాంక్ నుంచి నగల షాపుకి వెళ్ళి వెండి సామాన్లు పాలిష్ పెట్టించి తెచ్చింది. రాగానే బీర్వాలో చీరలన్నీ అటూ ఇటూ లాగి మంచి రంగు బ్లౌజ్ ఉన్న చీర సెలెక్ట్ చేసుకుంది. టైం లేదు. లేకపోతే కొత్త చీర కొందును అనుకుంది. ఆ మర్నాడంతా ఇంట్లో ఒకటే హడావిడి. ఇల్లంతా బూజులు దులిపించి కర్టెన్‌లు, సోఫా కవర్లు మార్చి షోకేసులో బొమ్మలన్నీ సర్ది దుప్పట్లు కొత్తవి వేసి ఫ్లవర్‌వాజ్‌లో పాత ప్లాస్టిక్ పువ్వులు తీసి కొత్త పువ్వులు మార్చి ఒకటే హడావిడి పడిపోయింది.

"ఏమిటి బాబూ ఈ హడావిడి. పిల్లల పెళ్ళికన్నా ఇలా సర్దావా ఇల్లు."

"మాట్లాడకండి, ఓ మూల కూర్చోండి అడ్డురాకండీ", కన్నెర్ర చేసింది.

ఇంతకీ ఏ వంట చేస్తున్నావు? కుతూహలంగా అడిగాడు ఆయన.

"సస్పెన్స్... ముందు చెప్పకూడదు. ఫోజు కొట్టింది. ఆ సాయంత్రం బ్యూటీ పార్లర్‌వెళ్ళి ఫేషియల్ చేయించుకుని, జుట్టుకి రంగు వేయించుకుని అటునుంచి బజారుకెళ్ళి వంటకి కావాల్సిన సామానంత కొనుక్కొచ్చింది.

* * * * * *

ఆ మర్నాడు తెల్లారే అయిదు గంటలకి లేచింది కనకమ్మగారు. రాత్రంతా నిద్రపోతే కదా ఆవిడ. ఎలా పడుతుంది. టి.వీ.లో పడడం అంటే మజాకానా మరి.

ఎన్నిసార్లు ఎస్.ఎమ్.ఎస్.లు, ఉత్తరాలు పంపింది. ఆఖరికి దేముడు కరుణించాడు.

గుమ్మం ముందు రంగురంగుల రంగవల్లులు దిద్ది, పూలరేకులతో 'మీ టి.వి.కి స్వాగతం' అంటూ రాసి బంతి పూల మాలలు గుమ్మానికి అలంకరించి వంటకి కావాల్సిన సరంజామా అంతా వెండి గిన్నెల నిండా సర్దింది. కూరలవి తరిగించి పెట్టింది. ఏర్పాట్లన్నీ పూర్తయ్యేసరికి అలసిపోయి వేడి వేడి నీళ్ళు పోసుకుని, వేడి కాఫీతో అస్ప్రిన్ వేసుకుంది.

'మీ టి.వీ.' రాక ఇరుగు పొరుగుకి నిన్ననే తెలిసింది. తెలియని వారందరికీ స్వయంగా ఆవిడే ఫోన్ చేసి గర్వంగా చెప్పేసింది. ఆడబడుచుకి, చెల్లెలికి ఫోన్ చేసి సాయానికి రమ్మంది. ఇరుగు పొరుగు వస్తామంటే అబ్బే ఇంత మంది వస్తే గోల అవుతుందంటారు - అయినా టి.వి.లో ఎలాగైనా చూస్తారుగా అనేసింది.

పదకొండు గంటలకి టి.వి. వాళ్ళనుంచి ఫోన్. మరో పదినిమిషాలలో వస్తున్నామని. వ్యాన్ హారన్ మ్రోగగానే 'రండర్రా వాళ్ళొచ్చారు' అని హడావుడి పడుతూ బొకే, వెండి పళ్ళెం పట్టుకుని ఆడవాళ్ళంతా గేటు దగ్గరికి నడిచారు.

"బాగుంది వెర్రి మగ పెళ్ళివారికి ఎదురు సన్నాహంలా హడావిడి - యాంకరమ్మకి కాళ్ళు కడిగి హారతి ఇస్తుందేమో.." నవ్వుకున్నాడు అంజనేయులు.

కాళ్ళు కడిగి హారతి ఇవ్వలేదు గాని బొట్టుపెట్టి రవిక గుడ్డ, పళ్ళు చేతిలో పెట్టి బొకే అందించి అట్టహాసంగా ఆహ్వానించింది కనకమ్మగారు.

"అబ్బో బాగా అరేంజ్ చేసారు. ముగ్గులవి మీరే పెట్టారా అమ్మమ్మగారూ", అంది యాంకరమ్మ వయ్యారంగా నడుస్తూ.

"ఆ, ఆ... అంతా నేనే చేసాను' అంది. కాని మనస్సులో "అమ్మమ్మగారూ అనడం ఎందుకు నేనేం అంత ముసలి దానిలా కనపడుతున్నానా అనుకుంది.

కెమెరాలు, లైట్లు, మనుషులు లోపలికి నడిచారు. లైటింగు, కెమెరా అన్నీ సర్దుకునే వరకు అందరికి కూల్‌డ్రింక్ ఇచ్చింది మేనకోడలు. కెమెరా మెన్ అంతా సరి చూసుకుని 'రెడీ కవితా, స్టార్ట్ చేద్దాం' అన్నాడు సిగ్నల్ ఇస్తూ – మేకప్ మేన్ వచ్చి యాంకరు మేకప్ టచ్ చేసాడు. అద్దంలో చూసుకుని, పూలు, చీర అవి సర్దుకుని 'పదండి అమ్మమ్మగారు వెళ్దాం' అంది యాంకరు. మేకప్ తనకి వేయలేదే అన్న సందేహం వచ్చి 'మరి నాకు మేకప్ వద్దా' అంది కనకమ్మగారు.

'మీకెందుకు చక్కగా అందంగా అమ్మమ్మలా ఉన్నారు' అంది యాంకరు. ఈ అమ్మమ్మ పదం వదలదు గాబోలు అనుకుంది కినుకుగా ... ఆవిడ మొహం చూసి 'హరీ ఆవిడకి కాస్త టచప్ చెయ్యి అంది. మేకప్ కుర్రాడు పౌడర్ పేడ్ మొహం మీద ఇటు అటూ అద్దాడు.

లైట్లు వెలిగాయి. కెమెరా పొజిషన్ చూసుకుని 'రెడీ' అన్నాడు కెమెరామెన్. అంత వరకు లేని గాబరా లైట్లు వెలిగి కెమెరా ముందుకు వెళ్ళగానే చెమట్లు పట్టాయి ఆవిడకి. 'నమస్కారం' ఈరోజు 'మీ టి.వి. అమ్మమ్మగారి వంట' కోసం మనం కనకమహాలక్ష్మి గారింటికొచ్చాం' – 'అమ్మమ్మ గారూ! ప్రేక్షకులకి ఏం వంట పరిచయం చేసి చూపిస్తారు' – కనకమ్మ కాస్త తడబడి 'ఈరోజు రెండు కొత్త రకం వంటలు చూపిస్తాను' అంది కాస్త తడబడి.

'అలాగా, మీలా కొత్త వంటలు చేసి చూపించే వారే కావాలి మాకు, మీ మొదటి వంట ఏం చూపిస్తారు?' అంది యాంకరు కవిత.

'బెండకాయ, చామదుంపలు, బచ్చలి కూరతో కూటు చేసి చూపిస్తాను' గర్వాంగా అంది. ఏంకరు మొహం అదోలో పెట్టి, 'చామదుంప, బెండకాయ, బచ్చలి అన్నీ జిగురుగా ఉంటాయి కదా, కూటు బాగుంటుందా, జిగురుండదా.'

"అబ్బే వండే విధంగా వండితే అన్నీ బాగుంటాయి. చేసి చూపిస్తాగా – ' గొప్పగా అంది.

"అయితే సరే, ఏమేం కావాలో – ఎలా చేయాలో చెప్పండి మరి –"

'కుక్కరులో ఓ కప్పు పెసరపప్పు ఉడికించి పెట్టుకోవాలి – ఓ కొబ్బరి చిప్ప, నాలుగు పచ్చి మిర్చి, జీలకర్ర వేసి రుబ్బి పెట్టుకోవాలి' ఒక్కొక్కటి చూపిస్తూ అంది.

“ఓ ఇవన్నీ ముందే రెడీ చేసి పెట్టుకున్నారన్నమాట. ఎంతయినా, అమ్మమ్మల కాలంలో అంతా పద్ధతి ప్రకారం చేసేవారు” మెచ్చుకోలుగా అంది ఏంకరు.

'మరంతే అమ్మాయీ, ఈ కాలం వాళ్ళ అన్నీ కుక్కర్లో తలో గిన్నెలో పడేసి ఉడికించడమా వంట అంటే – పప్పు సన్నని సెగన ఉడకాలి, పులుసు నెమ్మదిగా మరగాలి'.

“ఆ... ఆ... అవునవును...” ఆవిడ్ని ఆపకపోతే ధోరణి పక్క త్రోవ పడుతుందనిపించి ఆపింది... “సరే ఇప్పుడు ఏం చెయ్యాలో చూపండి.”

కనకమ్మగారు కుక్కర్ స్టౌమీద పెట్టి నూనె వేసి జీలకర్ర, ఆవాలు, ఇంగువ, కరివేపాకు వేసింది. “వేగిందా, ఇంక ఇప్పుడేం వెయ్యాలి” ఏంకరు అంది. “అయ్యో దానమ్మకడుపుడక, తొందరపడితే ఎలా అమ్మాయి పోపు వేగద్దా, ఆవాలు చిటపటలాడద్దా – అయినా మీ టి.వి. వంటల్లో పోపు వేస్తారు. అవివేగకుండా దానిమీద ఉల్లిపాయల ముక్కలు, టమోటా ముక్కలు కూరలు అన్నీ వేసేస్తూంటారు – అపుడు అడుగున పోపు ఎలా వేగుతుంది. ఆవాలు కసకసలాడవూ – నేనెన్నిసార్లు మీకు ఓ కార్డు రాసి పడేద్దామనుకున్నాను. అంతేకాదు – ప్రతి వంటలో ఇంత అల్లం వెల్లుల్లి ముద్ద పడేస్తారు అన్నీ ఒకే రుచిలో ఉండవూ కూరలు –” హాస్యంగా అన్నట్టు దులపడం మొదలుపెట్టింది కనకమ్మ. ఏంకరమ్మ బిక్క మొహం పెట్టి 'అవునా అమ్మమ్మగారూ అలా వేయకూడదా' అంది ఏడవలేని నవ్వు నవ్వి – పోపు వేగాక ఓ గ్లాసు నీళ్ళు పోసి అందులో బెండకాయ ముక్కలు, బచ్చలి ఆకు, ఉడికించిన చామదుంపలు, పెసరపప్పు, కొబ్బరిముద్ద అన్నీ వేసింది – 'ఇప్పుడేం చెయ్యాలి అమ్మమ్మగారూ?”

“ఏం చెయ్యడం ఏమిటి, అన్నీ ఉడకద్దూ మరి –' అంటూ కుక్కరు మూత పెట్టింది.

'ఇది వరకీ కూర చేసారా, ఇదే మొదటి సారా –' ఆవిడ అన్నీ కలిపి కుక్కరు ఉ డికించడం చూసి సందేహంగా అడిగింది ఏంకరమ్మ.

'ఓ చాలా సార్లు చేసా – ఇందులో ఉండే కూరలన్నింటిలో పుష్కలంగా విటమిన్లు, ప్రొటీన్లు అన్నీ ఉన్నాయి. తినేదేదో కాస్త హెల్దీ ఫుడ్ తినాలమ్మా – ఈ కాలం

పిల్లలు నేతులు, నూనెలు మానేసి ఎండుపుల్లల్లాగా తయారవుతున్నారు. మా కాలంలో అన్నీ తినడం వల్ల చూసావా, ఇప్పటికి మా చర్మం ఎలా నిగనిగలాడుతుందో' -

'అమ్మో అమ్మమ్మగారికి విటమిన్లు, ప్రొటీన్లు అన్నీ తెలుసన్నమాట.'

'ఐలేదానివే అమ్మాయీ - అమ్మమ్మ అంటే నాకేం ఎనభై ఏళ్లున్నాయా ... అమ్మమ్మ అవ్వడానికి ఏం ఉంది. నలభై ఆరేళ్ళకే అయిపోయాను. నేను ఇంటర్ చదువుకున్నాను తెలుసా' చదువురాదని అనుకుంటుందేమోనని సందు చూసి చెప్పేసింది.

"మరీ, ఉడికిందేమో చూద్దామా –" కవిత తొందరపెట్టి మూత తీయబోయింది.

'అలా తొందరపడితే ఎలా - ఇప్పుడేగా స్టవ్ ఆర్పాము - ఆవిరి పోవద్దూ" దబాయింపుగా అంది.

'ఆ, అమ్మమ్మగారు తీరిక సమయాల్లో ఏం చేస్తుంటారు?'

'బుక్స్ చదువుతాను, టి.వి. చూస్తాను - మీ వంటలన్నీ ఎక్స్‌పెర్‌మెంట్ చేస్తుంటాను.'

'సరే, ఇంక చూడండి మరి.' ఎట్టకేలకు యుగాల తర్వాత అన్నట్టు మూత తీసింది.

'అబ్బ, ఎంత కమ్మటి వాసనొస్తుందో చూసావా –' అని తనే పొగుడుకుని గరిట తీసి అడుగునించి కలిపింది. కుక్కర్లోకి చూసిన కవితకి అంత కలిపి చిక్కటి జిగురు ముద్దలా గరిటలోంచి జారుతూ కనిపించింది. కనకమ్మగారు గాభరాపడిపోయింది. మొహం తెల్లగా పాలిపోయింది. ఆవిడ అవతారం చూసి 'కట్' అన్నాడు కమెరామేన్. - 'ఏమిటివాళ్ళ ఎందుకిలా అయింది. ఎక్కువ ఉడికిపోయినట్లుంది. మామూలుగా కుక్కర్‌లో కాకుండా విడిగా చేస్తాను. మీరు తొందరపెడ్తారని గబగబ అయిపోతుందని కుక్కర్లో వేసాను –' తప్పు మీదేన్నట్టు అంది కనకమ్మ. కూరలోంచి గరిట ఊడిపడలేదు. ఆ ఉడికిన కూర వడగడితే ఎన్ని సీసాల జిగురు తయారవుతుందో అనిపించింది కవితకి. పెద్ద గొప్పగా చేస్తానని ఫోజిచ్చింది - జిగురుకూరలన్నీ కుక్కర్లోవేస్తే బంక ముద్ద కాకపోతే ఏం అవుతుంది అనుకుంది కసిగా ఏంకరు.

"అయినా రుచి బాగానే ఉంటుందిలేండి. కాస్త ముద్దయినా –" సర్దుకుంటూ అంది కనకమ్మ.

"భగవంతుడా ఈజిగురు ముద్దతింటే నా నోరు మళ్ళీ పెగుల్తుందా' అని భయపడి ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కెమెరామాన్ వంక చూసింది - 'కూర సరిగా రాలేదు, ఏం చేద్దాం రమేష్' అంది కవిత.

'పోనీ మళ్ళీ చేస్తాను కాస్త టైమిస్తే ఈసారి సరిగా చేస్తా-' నసిగిందావిడ.

'వద్దు, వద్దు అంత టైంలేదు, ఉడికిన దాన్ని లాంగ్ షాట్‌లో చూపించి లాగించేద్దాం. కవిత ఓ చెమ్చాతో తింటున్నట్టు ఫోజిచ్చేయ్ లాగించేద్దాం' అన్నాడు రమేష్.

బితుకు బితుకుమంటూ చెమ్చాతో కాస్త తీసి నోట్లో పెట్టుకోబోతూంటే ఆమెకి తెలియకుండానే మొహం వెగటుగా పెట్టింది ఏంకరమ్మ. 'కట్' అన్నాడు కెమరామేన్.

'కవిత, ఎక్స్‌ప్రెషన్ చూసుకో సరిగా...' రమేష్ హెచ్చరిస్తూ అన్నాడు.

'ఆ... ఆ.. కట్ చెయ్యకండి... అలా ముందు వెగటుగా పెట్టి నోట్లో పెట్టుకోగానే అలా క్రమంగా ఆమె మొహంలో ఎంత బాగుంది అన్న ఎక్స్‌ప్రెషన్ ఇచ్చేసి "ఏమో అనుకున్నాను రుచి చాలా బాగుంది సుమా" అనిపించేయండి. 'డైరెక్షన్ ఎడిటింగూ తనే చెప్పేసింది కనకమ్మ. రమేష్ చిరాగ్గా చూసి "కవిత, ఎక్స్‌ప్రెషన్ ఇచ్చేయి త్వరగా - " అని తొందరపెట్టాడు.

మొత్తానికి మొదటి వంట పూర్తి అయిందనిపించారు.

మళ్ళీ రెండో వంటకి సీను - 'అమ్మమ్మగారూ మీ రెండో వంట ఏం చూపిస్తారు' ఎంత మామూలుగా అడగాలనుకున్నా కాస్త అప్రసన్నత తొంగిచూసింది మొహంలో.

కనకమ్మగారి మొహంలో మొదట ఉన్న ఉత్సాహం తగ్గి కళా విహీనమైంది.

"మైదా హల్వా చేస్తాను...", 'ఓ స్వీటా' అని పైకి అని ఇది మరో బంక ముద్దచేసి నా మొహాన పడేస్తావా తల్లీ అని అనుకుని - 'సరే మరి మొదలుపెట్టండి అంది.' కనకమ్మ స్టౌ వెలిగించి మూకుడు పెట్టి ఓ గ్లాసు నీళ్ళు పోసి మైదా కలిపి మూకుడులో పోసింది. దాన్లో ఓ గ్లాసు పంచదార కూడా వేసి తిప్పడం మొదలుపెట్టింది. "ఇంకేం వెయ్యాలి దీన్లో –" కవిత అడిగింది.

"కాస్త ఉడికి ముద్దగా అయ్యాక నెయ్యి వెయ్యాలి - హల్వా అంటే మరి నెయ్యి కదా ఇలా తిప్పుతూ గట్టి పడ్డాక కాస్త కాస్త నెయ్యి వెయ్యాలి..."

'సరే, ఈలోగా మీకు తెల్సిన ఓ చిట్కా చెప్పండి మరి' అంది అలవాటుగా.

'ఓ దానికేం భాగ్యం - బోలెడు వచ్చు - మనం నిమ్మకాయ రసం పిండాక ఆ డిప్పలు పారేయకుండా మొహం చేతులకి రాసుకుంటే చర్మం నిగారింపు వస్తుంది. నేనలాగే చేస్తాను. అందుకే నా చర్మం ఇలా ఉంది' అంది గొప్పగా.

చిట్కా చెప్తూ గరిట తిప్పడం మర్చిపోయింది కనకమ్మగారు - హైలో ఉందేమో స్టవ్ నిమిషంలో మూకుడులో ముద్ద అడుగంటి మాడు వాసన మొదలయింది - కవిత గాభరాగా స్టవ్ ఆర్పేసింది. 'నా మతిమండా సమయానికి స్టౌ అర్పేసావు, అడుగంటలేదులే అంటూ నెయ్యి పోసి మళ్ళీ తిప్పడం మొదలుపెట్టింది. అడుగంటిన రంగు కలిసి తెల్ల ముద్ద రంగుమారింది. అదేం చూడనట్టు తిప్పుతున్నా హల్వాలాగే ఆవిడ మొహం మాడింది. హల్వా కాస్తా గట్టిపడగానే జీడిపప్పులు, కిస్‌మిస్, ఏలకిలు వేసి పళ్ళెంలో దిమ్మరించి హల్వా రెడి, రుచి చూసి చెప్పండి మరి' నవ్వుతూ పోజిచ్చింది.

ఇదో జిగురు ముద్ద, చిన్నప్పుడు అమ్మ పుస్తకాలు అంటించుకోడానికి మైదా ఉడకపెట్టి ఇచ్చిన ముద్దలా ఉంది అనుకుంది.

ఏదో స్వీట్ గనక కాస్త తియ్యగహే ఉంటుంది కనుక ఆ కూరంత, ఘోరంగా ఉండదులే అనుకుంటూ చెమ్చాతో రెండు జీడిపప్పులు తీసి నోట్లో వేసుకుంది.

ముందు మాడు వాసన, ఆ తరువాత పచ్చి మైదా రుచి. బాగున్నది ఏదన్నా ఉంటే జీడిపప్పుల రుచి! 'బాగుంది బాగుంది' అంది నవ్వు పులుముకుని.

"మీరూ తినండి... రుచి చూడండి" అంటూ అందరికి ఇచ్చింది కనకమ్మ. అందరూ నోట్లో పెట్టుకుని అతి కష్టం మీద నవ్వులు మొహాన పులుముకుని బాగుంది అంటూ అడ్డంగా, నిలువుగా తలలాడించారు. ఇంత మంచి వంటలు చూపించి నందుకు 'మీ టి.వి. తరఫున మీకీచీర' అందిస్తూ అంది కవిత.

షూటింగ్ పూర్తయి బతుకుజీవుడా అన్నట్లు గబగబ కెమెరాలు, లైట్లు సర్దేసుకుని బయటపడ్డారంతా - మామూలుగా అయితే స్నాక్స్, టిఫిన్లు చేసినవి రోజు అందరూ ఫలహారాలు రుచి చూసి వెళ్ళేవారు. ఆరోజు చేసినవి ఎక్కడ మారు తినమంటుందో నన్నట్టు ఎవరో తరిమినట్టు బయటపడ్డారంతా.

"ఏమిటయ్యా రమేష్ ఇంతకంటే మంచి సెలక్షన్ దొరకలేదా సెలెక్ట్ చేయడానికి. మీకేం బాబూ ఆ వంటలు తినలేక చచ్చేదాన్ని నేను' గయ్‌మంది కవిత వ్యాన్ ఎక్కాక.

'ఆవిడ వంటలు కాదు వెంటి సామాను, తన నగలు చూపించడానికి పిలిచి నట్లుంది. మాటలు మాత్రం కోటలు దాటాయి.'

'ఈ వంటలు ప్రేక్షకులకి చూపిస్తే ఎన్ని తిట్లు తిడతారో, ప్రొడ్యూసర్ ఏం అంటాడో ఆలోచించుకో' – అన్నాడు కెమెరామెన్.

'మరి చీర కూడ సమర్పించుకున్నాం. ప్రోగ్రాం లేకుండా చీర నష్టం అంటారేమో' కవిత అంది.

'ఏమో ప్రొడ్యూసర్‌కి చూపిద్దాం – ఫైనల్ డెసిషన్ ఆయనే చూసుకుంటాడు' రమేష్ అన్నాడు.

'శంకర్ కాస్త ఈ గుడి, పార్క్ వగైరా నాలుగైదు చోట్ల షాట్లు తీద్దాం. ఈవిడని వీలయినంత కట్ చేద్దాం' వేన్ ఆపి కాస్త నాలుగైదు షాట్లు తీయి' అన్నాడు రమేష్.

* * * * * *

వారం తర్వాత 'టెక్నికల్ ప్రాబ్లమ్స్ వల్ల, అనివార్య కారణాల వల్ల ఆవిడ ప్రోగ్రాం వేయలేక పోతున్నందుకు చింతిస్తున్నాం' అన్న ఫోను అందుకున్న కనకమ్మ మూర్ఛ అయితే పోలేదు కాని చేష్టలుడిగినట్లు అలా ఉండిపోయింది చాలా సేపు.

(చిత్ర – అనుబంధ హాస్య కథల సంపుటి, మే 2012)